విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే చిట్టెం ఆగ్రహం
- పని చేయడం చేత కాకపోతే రాజీనామా చేయండి
- రసాభాసగా మండల సభ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఆత్మకూర్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లి, ప్రజలకు మేలు చేసే విధంగా పని చేయాలని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీపీ బంగారు శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే అధికారులను ఉపేక్షించమని స్పష్టం చేశారు. అధికారులు పనులు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. పంచాయతీరాజ్ ఏఈ ధర్మరాజు అధర్మమైన పనులు చేస్తున్నాడని, ఐదు శాతం లంచం ఇవ్వనిదే ఎంబీ రికార్డులు చేయడం లేదని జూరాల ఎంపీటీసీ సభ్యుడు పరమేష్, తూంపల్లి సర్పంచ్ లక్ష్మీకాంత్ రెడ్డి ఆరోపించారు. అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని, లంచం తీసుకొని కూడా తమ బిల్లులు చేయకపోవడంతో వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. లంచం తీసుకోవడం, ఇవ్వడం కూడా నేరమే అని ఎమ్మెల్యే అధికారి తీరుపై మండిపడ్డారు.

వేధిస్తున్న విద్యుత్ సమస్యలు

మండలంలోని బాలకిష్టాపూర్, జూరాల గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల పనులు పూర్తయిన ప్రారంభించక పోవడంతో విద్యుత్ సమస్యలను ఎదుర్కొంటున్నామని సర్పంచ్‌లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పల్లె, పట్టణ ప్రగతిలో అవసరం ఉన్న చోట కొత్త స్తంభాలు పాతారని, నేటి వరకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేయలేదని, వ్యవసాయానికి విద్యుత్ కోతలు విధిస్తున్నారని, కొందరు ట్రాన్స్‌కో అధికారుల పనితీరు నిర్లక్ష్యంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎండుతున్న పంటలు

సాగునీటి సరఫరా విషయంలో జూరాల ప్రాజెక్టు అధికారులు నిర్లక్ష్యం కారణంగా చేతికొచ్చిన పంటలు ఎండిపోతున్నాయని, ఇక్కడి నీళ్లతో ఇతర ప్రాంతాల్లో పంటలను సమృద్ధిగా పండించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీజేపీ అధికారుల పని తీరుపై ఎమ్మెల్యే తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రతిరోజు సాగునీటి సమస్యపైనే తనకు రైతులు ఫోన్లు చేస్తున్నారని, అధికారులు సమస్యను తీర్చడంలో ఘోరంగా విఫలమవుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇక్కడి జూరాల ప్రాజెక్టుకు సంబంధించి నాగర్‌కర్నూల్‌లో ఐడీసీ సమావేశం జరపడమేంటని ఆత్మకూర్‌లో సమావేశం ఏర్పాటు చేయాలని పీజేపీ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పనులు చేయడం చేతకాకపోతే ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లిపోవాలని స్పష్టం చేసారు. త్వరలోనే సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని ఆయాశాఖల అధికారులు హామినివ్వడంతో సభ్యులు శాంతించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ డాక్టర్ శివరంజని, వైస్‌ఎంపీపీ కోటేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్‌ఏ రాజు, తహసీల్దార్ సింధూజ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, కోఆప్షన్ మహబూబ్‌పాష తదితరులు ఉన్నారు.

సుందరయ్య ఆశయ సాధన కృషి


తెల్లరాళ్లపల్లితండాలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు


వనపర్తిలో మాట్లాడుతున్న పుట్ట ఆంజనేయులు

పాన్‌గల్: ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బాల్యానాయక్ అన్నారు. శుక్రవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకొని మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు గాంధీగా పేరొందిన సుందరయ్య తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలల్లో ప్రముఖుడిగా నిలిచారన్నారు. కుల వ్యవస్థను వ్యతిరేకిస్తూ ఇతడి అసలు పేరు పుచ్చలపల్లి సుందరరామిరెడ్డిలోని రెడ్డి అనే కుల సూచికను తొలగించుకున్న గొప్ప నాయకుడు అని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతమ్మ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వనపర్తి టౌన్: భూస్వామ్య కుటుంబంలో పుట్టిన పుచ్చలపల్లి సుందరయ్య నిరుపేదల విముక్తి కోసం జీవితమంతా పోరాడాడని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా టీజేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవులు గిరి రాజాచారి, డాక్టర్ నరసింహాశర్మ, ఈశ్వర్, గంధం నాగరాజు, వెంకటస్వామి, మద్దిలేటి పాల్గొన్నారు.

వనపర్తి: దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, ప్రజా పోరాటాల నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలు కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పుట్ట ఆంజనేయులు అన్నారు. శుక్రవారం సుందరయ్య వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు మదన్, బాలరాజు, రాములు, రాబర్ట్, చుక్క పెంటయ్య, కురుమయ్య, విజయకుమార్, మన్యం తదితరులు పాల్గొన్నారు.

జమ ఖర్చులు చూపిస్తామని పిలిచి..

అమరచింత: పట్టణంలోని రహెమానియా మసీదులో నూతనంగా చేపట్టిన నిర్మాణ పనులకు సంబంధించిన ఖర్చుల వివరాలను చూపిస్తామని పిలిపించి తమపై దాడి చేశారంటూ అక్రమ్, ఇర్ఫాన్ శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. మసీదు నిర్మాణ పనుల కోసం ముస్లింలు వసూలు చేసిన చందా వివరాలు, నిర్మాణం కోసం అయిన ఖర్చుల వివరాలను కమిటీ సభ్యులకు వివరించాలని కొన్ని రోజులుగా మసీద్ కమిటీ అధ్యక్షుడిని షంషీర్‌తో పాటు మరో ఇద్దరు కోరారు. దీంతో శుక్రవారం నమాజ్ అనంతరం షంషీర్‌కు ఫోన్‌చేసి లెక్కలు చూపిస్తామని మసీద్‌కు రావాలని సూచించారు. దీంతో షంషీర్‌తో పాటు అతని కుమారుడు ఇర్ఫాన్, అన్న కుమారుడు అక్రమ్‌తో కలిసి మసీదు వెళ్లాడు. మసీద్ నిర్మాణ పనుల లెక్కలు చూస్తుండగా కొంత మంది తమను బూతు మాటలు మాట్లాడుతూ దాడికి యత్నిస్తుండగా అక్కడి నుంచి తప్పించుకొని వస్తుండగా.. అబ్దుల్‌నబీ, కరీమ్, తబ్‌రేస్, పారుఖ్, ఆటో పాయాజ్ దాడి చేశారని షంషీర్ తెలిపాడు. తమపై దాడి చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని బాధితులు షంషీర్, ఇర్ఫాన్, అక్రమ్ తెలిపారు.

అసంపూర్తి డ్రెయినేజీ పనులు పూర్తిచేయండి

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని రోడ్డుకు ఇరువైపులా చేపట్టిన డ్రెయినేజీ పనులు అసంపూర్తిగా చేస్తున్నారని కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కనీసం క్యూరింగ్ కోసం నీళ్లు కూడా పట్టలేదన్నారు. అలాగే కాలనీ రోడ్లకు వెళ్లే దారిపై కల్వర్టులు నాసిరకంగా స్లాబులు వేయడంతో ఇప్పటికే నెర్రలు వస్తున్నాయి. ఈ పనులు నిర్మాణం చేసి అసంపూర్తిగా వదిలేయడంతో షాపుల యాజమానులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు, పాలకవర్గం సభ్యులు పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలు దృష్టిలో పెట్టుకొని డ్రెయినేజీ పనులు నాణ్యతగా నిర్మాణం చేస్తూ త్వరగా పూర్తి చేయాలని కోరారు.

పారిశుద్ధ్యంపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు


అప్పారెడ్డిపల్లిలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయ్‌కుమార్


అన్నారంలో..

పాన్‌గల్: కలెక్టర్ ఆదేశానుసారం మండలంలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్యక్రమాలపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అన్నారంలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను ఆయన సర్పంచ్ రాములుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని డ్రెయినేజీలను, రోడ్లను శుభ్రం చేయడం, పాడుబడిన బహిరంగ బావులను మట్టితో నింపడం, పనికిరాని బోరు బావులను మూసివేయడం, తాగునీటి వనరుల తనిఖీ, శుభ్రపర్చడం, క్లోరినేషన్ చేయడం వంటి పనులను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వారం రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని మల్కిమియాన్‌పల్లి, అప్పారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో పర్యటించిన ఆయన ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా మర్రిచెరువు వెనకాల వాగు కాల్వకు జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతు పంచాయతీ కార్యదర్శులు ఉదయం 7 గంటల వరకు గ్రామాలకు చేరుకుని గుర్తించిన పనులను చేయించాలన్నారు. ఈ నెల 23వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో గుర్తించిన పనులు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. సర్పంచ్‌లు కృష్ణవేణి, శాంత, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



పెబ్బేరు: మండలంలోని పాత సూగూర్‌లో ఎస్పీఎల్-10 క్రికెట్ పోటీల్లో శుక్రవారం రైసింగ్ కింగ్స్ టీం విజేతగా నిలిచింది. సూగూర్ ప్రీమియర్ లీగ్-10 క్రికెట్ పోటీల్లో ఫైనల్‌లో మణికంఠ రైజర్స్, రైసింగ్ కింగ్స్ మధ్య జరిగిన పోటీలో రైసింగ్ కింగ్స్ విజయం సాధించింది. అనంతరం విజేతలకు సర్పంచ్ వెంకటస్వామి, నాయకులు కురుమూర్తి, పరశురామ్ యాదవ్ బహుమతులు అందజేశారు.

రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

పాన్‌గల్: ఉపాధి పథకంలో రైతులకు ఉపయోగపడే పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి ఉపాధి సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని అన్నారంతండా, అన్నారం గ్రామాల్లో చెరువుల్లో ఒండ్రుమట్టి తరలింపు పనులను ఆయన పరిశీలించారు. ఎక్కువగా సాగునీటి కాల్వల మరమ్మతు, చెరువులు, కుంటలలో ఉపాధి పనులను చేపట్టాలన్నారు. ఆయా పనులను నిబంధనల మేరకు చేపట్టాలని, వేసవి కాలం దృష్ట్యా కూలీలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను పరిశీలించి నీరు పట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు బోజ్యానాయక్, ఆంజనేయులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నేషనల్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక


సీహెచ్ జయవర్ధన్


అశోక్

వీపనగండ్ల: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ఇద్దరు విద్యార్థులు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. 8వ తరగతి చదువుతున్న సీహెచ్ జయవర్ధన్, అశోక్ నేషనల్ మెరిట్ మెయిన్స్ స్కాలర్‌షిప్ కోసం నిర్వహించిన ఎంట్రన్స్ పరీక్షల్లో ప్రతిభ కనబరచడంతో వీరికి ప్రతి సంవత్సరం రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ డబ్బులను అందజేయనుంది.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం


గోపాల్‌పేటలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

ఆత్మకూర్: వీఆర్‌ఏలను రెగ్యులర్ చేస్తూ పదోన్నతులు, వారసులకు ఉద్యోగాలు కల్పించేందుకు రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడంతో వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి, మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో గోవిందు, గట్టన్న, నాగేంద్రం, శ్రీనివాసులు, పావని, రాములు, నయ్యూం, మోసీన్, తిమ్మక్క, రాములు, శ్రీను, రంగన్న ఉన్నారు.

మేదరి సంఘం ఆధ్వర్యంలో

కులవృత్తులను గుర్తించి ఆర్థికంగా ప్రోత్సహిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆరే అని మేదరి మహేంద్ర సంఘం నాయకులు శ్రీనివాసులు, కొండయ్య, తోట రవి అన్నారు. శుక్రవారం మేదరి సంఘం ఆధ్వర్యంలో స్థానిక గాంధీచౌక్‌లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కృష్ణయ్య, శ్రీనివాసులు, పెంటయ్య, వెంకటేష్, మన్యం, మహేష్, నాగరాజు, వినోద్, మహేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించడంతో పాటు వీఆర్‌ఏలనే రెగ్యులర్ చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ క్యాబినేట్ సమావేశంలో ఆమోదించడం హర్షణీయమని వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మహిమూద్, మునిస్వామి తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఎం చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో గాయత్రి, శ్రీనివాస్, గోవర్ధన్, నారాయణ, వెంకటన్న, జహీర్ పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం వీఆర్‌ఏలు ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్, వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పాన్‌గల్: రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న వీఆర్‌ఏలను రెగ్యులర్ చేస్తూ వారిని వివిధ శాఖల్లో సర్దుబాటు చేస్తామని కేబినేట్‌లో నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ మండల వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మునీరొద్దీన్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: వీఆర్‌ఏలను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి పే స్కేల్ ద్వారా జీతం డబ్బులను అందజేయాలని క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చిత్రపటానికి వీఆర్‌ఏలు స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బిజ్జ పరమేశ్, మౌలాలీ, కార్యదర్శులు నాగలక్ష్మి, పావని పాల్గొన్నారు.


ఆత్మకూర్‌లో..

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్‌ఏలు శుక్రవారం ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. కార్యక్రమంలో వీఆర్‌ఏలు రాజశేఖర్, భీమేశ్వర్‌రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి వీఆర్‌ఏలు పాలాభిషేకం చేశారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు


నందిమళ్లలో ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓలు

అమరచింత: ఆయిల్‌పాం సాగుతో రైతులకు అధిక లాభాలు కలిగే అవకాశం ఉందని మండల వ్యవసాయ విస్తరణ అధికారులు రాజేష్, మల్లేష్ అన్నారు. నందిమళ్ల, పాంరెడ్డిపల్లి రైతువేదికలో ఆయిల్‌పాం రైతులకు సాగుపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయిల్‌పాం సాగుకోసం ప్రభుత్వం ఏడాదికి ఎకరానికి రూ.4,200లు పెట్టుబడిసాయం అందిస్తుందని తెలిపారు. ఆయిల్‌పాం మొక్కను రూ.20 సబ్సిడీతో అందిస్తుందన్నారు. డ్రిప్ కోసం ఎస్సీ, ఎస్టీలకు వందశాతం సబ్సిడీ ఇవ్వగా.. బీసీలకు 90 శాతం సబ్సిడీపై అందించనున్నట్లు వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో గరుడజ్యోతి మహోత్సవం


స్వామివారికి పల్లకీసేవ చేస్తున్న భక్తులు

ఆత్మకూర్: వైశాఖ అమావాస్యను పురస్కరించుకుని మల్లాపురం క్షేత్రంలో లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, గరుడజ్యోతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం రాత్రి ఆత్మకూర్ శివారులోని మల్లాపురం ఆంజనేయస్వామి, లక్ష్మీనర్సింహాస్వామి ఆలయాల వద్ద ప్రముఖ వేదపండితులు శ్రీనివాసరాఘవన్, వెంకటశేషశర్మ, కిషోర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, పల్లకీసేవ చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ, ఎస్‌ఐ

చిన్నంబావి: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఫర్టిలైజర్ దుకాణాల నిర్వాహకులకు మండల వ్యవసాయాధికారి డాకేశ్వర్‌గౌడ్, ఎస్‌ఐ వస్రంనాయక్ సూచించారు. మండల కేంద్రంలోని సీడ్స్ దుకాణాలను శుక్రవారం సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని సూచించారు. రైతులు నష్టపోయే విధంగా నకిలీ విత్తనాలనను విక్రయిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులకు విత్తనాలను విక్రయించేటప్పుడు తప్పకుండా రసీదు ఇవ్వడంతో పాటు రికార్డులో నమోదు చేసుకోవాలని సూచించారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లకు దరఖాస్తుల స్వీకరణ

పెబ్బేరు: పట్టణ కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం పథకం ద్వారా ఇళ్లు కేటాయించడం కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ అబ్రహంలింకన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ తేజస్ నంద్‌లాల్‌పవర్ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రతి వార్డులో ఏర్పాటు చేసిన కౌంటర్లలో మహిళల పేరుపై దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్, ఓటర్ కార్డు, ఆదాయ ధ్రువ పత్రం, అర్జీదారు దివ్యాంగులు అయితే సందరం సర్టిఫికెట్ జిరాక్స్‌లు జతపరిచి వార్డు నెంబర్, ఉన్న ఇంటి నంబర్‌తో దరఖాస్తులు ఇవ్వాలని, వార్డుల వారీగా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు


ఖిల్లాఘనపురం వీరభద్రస్వామి ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న గోపి తదితరులు


అమరచింతలో..

అమరచింత: అమావాస్యను పురస్కరించుకొని మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో దేవేంద్రయ్యచారి మఠంలో పూజా కార్యక్రమాలతో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. చంద్రగఢ్ కోటపై గల శివాలయంలో పూజలతో పాటు ప్రసాదాలను భక్తులకు వితరణ చేశారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని వీరన్న గుట్టపై వెలిసిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం వద్ద శుక్రవారం అన్నదానం చేశారు. నిర్వాహకులు కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో స్వామివారికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి నెల అమావాస్య రోజున దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని గోపి తెలిపారు. సర్పంచ్ వెంకటరమణ, ఉప సర్పంచ్ యాదయ్య, రాళ్ల కృష్ణయ్య పాల్గొన్నారు.

ఏ6గా కేసు నమోదు

వనపర్తి: మిషనరీ లేకున్నా.. సీఎంఆర్ అనుమతి పొందిన రేకులషెడ్ యాజమాన్యంపై ఏ6గా కేసున మోదు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారని బీజేపీ నాయకులు బి.కృష్ణ, జింకల కృష్ణయ్య, పెద్దిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఈ విషయంపై తాము కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌ను కలిస్తే ఆయన వెల్లడించాలని తెలిపారు.

క్లుప్తంగా

అందుబాటులో జీలుగ విత్తనాలు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు ఏఓ చంద్రమౌళి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వానాకాలం సీజన్‌లో పంటల సాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువులు జీలుగ, జనుము విత్తనాలు సాగు చేసి పూత దశలో కరిగెటలో కలియ దున్నినట్లయితే భూమిలో సారం పెరిగి అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. జీలుగ విత్తనాలు కావాల్సిన రైతులు తమ ఆధార్ కార్డు, పాస్ బుక్ జిరాక్స్ కాపీలు తీసుకొని వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఆర్థికసాయం అందజేత



వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన వడ్డె మంగమ్మ కుమార్తె వివాహానికి అదే గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ముంత మల్లయ్య బియ్యంతో పాటు నగదును శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కర్ణాకర్‌రెడ్డి, కొల్లాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చాపల సాయిబాబ, ఏటూరి కుర్మయ్య, బాలకృష్ణ, శేఖర్, నర్సింహ, చెన్నకృష్ణ, రాంచందర్, సంగనమోని శేఖర్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

గోపాల్‌పేట: మండల కేంద్రం నుంచి ఏదుట్ల వెళ్లే దారిలో వెటర్నరీకి సంబంధించిన భూమిని కొందరు కబ్జా చేస్తున్నారని, ప్రభుత్వ భూమిని కాపాడాలని జిల్లా గొర్రె కాపరుల సంఘం వైస్ చైర్మన్ చంద్రయ్య యాదవ్, డైరెక్టర్ పరశురాములు స్థానిక ఎస్‌ఐ వెంకటేశ్వర్లును కోరారు. సర్వే నంబరు 422లో గల ప్రభుత్వ గొర్రెలు, ఉన్ని విస్తరణ కేంద్రం అసైన్‌మెంట్ భూమి 11 గుంటల్లో ఉందని దానికి హద్దులుగా పాతిన రాళ్లను తొలగించి, మొరం కొట్టారని, ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



అమరచింత: మండలంలోని ఈర్లదిన్నెలో శుక్రవారం జరిగిన బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో మూడు రోజుల నుంచి నూతనంగా నిర్మించిన శివాంజనేయస్వామి ఆలయంలో దేవతా మూర్తుల విగ్రహాలు, ధ్వజ స్తంభం, నవగ్రహా, బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ చుక్క లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

రుణ సౌకర్యం కల్పించడంపై హర్షం

వనపర్తి: రాష్ట్ర ఏర్పాటు తర్వాత మొదటిసారి విశ్వబ్రాహ్మణులను గుర్తించి రుణ సౌకర్యం కల్పించేందుకు మంత్రి వర్గం ఆమోదం తెలపటం హర్షణీయమని జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పరమేశ్వర్ ఆచారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణుల్లో చాలా మంది పేదరికంతో మగ్గుతున్నారని, ఇళ్లు లేని వారిని గుర్తించి డబుల్‌బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయాలని కోరారు.

ఫిట్‌నెస్ సెంటర్‌లో అగ్నిప్రమాదం



వనపర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని డిఫైన్ ఫిట్‌నెస్ సెంటర్‌లో శుక్రవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. యజమాని దినేష్ ఇచ్చిన సమాచారంతో వనపర్తి అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్ చంద్రశేఖర్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. సెంటర్‌లోని మ్యూజిక్ సిస్టమ్‌లో షార్ట్‌సర్క్యూట్ కావటంతో అగ్నిప్రమాదం చోటు చేసుకున్నట్లు గుర్తించారు. మూసి ఉన్న ఫిట్‌నెస్ సెంటర్‌లో పొగలు రావటంతో చుట్టుపక్కల వారు నిర్వాహకులకు సమాచారం ఇచ్చారు. ఘటనలో రూ.3 లక్షలకు పైబడి నష్టం జరిగిందని నిర్వాహకుడు దినేష్ తెలిపారు.